వ్యర్థాల వేలం రూ.15.50 లక్షలే!

- వనపర్తి మునిసిపల్ ఆదాయానికి భారీగా కోత
- గత ఏడాది రూ. 29.30 లక్షలు పలికిన బహిరంగ వేలం
- బురిడీ బాబా నుంచి రికవరీ చేయని గత ఏడాది సొమ్ము

6



కిర్గిస్థాన్ పోటీదారు



బతుకమ్మ ఆడుతున్న సుందరీమణులు

ఫ్రైడే 40 డిగ్రీల ఎండ వేడిమి.. సొంతం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది.. కానీ ట్రాఫిక్ ఆంక్షల మధ్య సాయం సంధ్యవేళ పిల్లలమర్రికి అరుదెంచిన ప్రపంచ అందగత్తెల సందడి పాలమూరును పులకింపజేసింది. మిస్ వరల్డ్ పోటీదారుల అందం చందం చూపరులను ఆకట్టుకున్నది. ఉత్సాహంగా బతుకమ్మలు ఆడారు.. పిల్లలమర్రిని చూసి మురిశారు.. మ్యూజియంలో చారిత్రక ప్రాధాన్యాన్ని ఆస్వాదించారు. రాజరాజేశ్వరి దేవాలయం ముందు ఫొటోలకు ఫోజులిచ్చారు. హ్యాష్‌ట్యాగ్ పిల్లలమర్రి సైన్ వద్ద పర్యటన విశేషాలను పదిలపరుచుకున్నారు.. సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల ఆదరాభిమానాలను మదినిండా నింపుకొని ఐఫోన్లలో పాలమూరు జ్ఞాపకాలను బంధించారు.. చారిత్రక పిల్లలమర్రిని సందర్శిద్దామనే సందేశంతో టాటాలు చెబుతూ, ఫ్లైయింగ్ కిస్‌లు ఇస్తూ మధుర స్వప్నంగా నిలిచారు మిస్ వరల్డ్ పోటీదారులు..

ముద్దుగుమ్మా.. అదిరెనులెమ్మా..

- పిల్లలమర్రి విశిష్టత విని పులకించిన అందాల భామలు
- ఫొటోలకు ఫోజులు, సెల్ఫీలు, నృత్యాలతో పులకింత
- పిల్లలమర్రి చెంతన మొక్కలు నాటిన ముద్దుగుమ్మలు
- ఈ చరిత్రను విశ్వవ్యాప్తం చేస్తామన్న సుందరీమణులు
- 22 దేశాల ముద్దుగుమ్మల రాకతో పులకించిన పాలమూరు

మహబూబ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పిల్లలమర్రి అందాలకు విశ్వసుందరీమణుల సొగసు తోడైంది. విదేశీ పర్యాటకులు ఎరగని ప్రాంతానికి కొత్త వైభవం వచ్చింది. సంస్కృతీ సంప్రదాయం, చారిత్రక వైభవం కలగలిపి మిస్ వరల్డ్ పోటీదారుల రాక విజయవంతమైంది. అందాల భామలు పాలమూరు నేలపై నడయాడటంతో పులకించిపోయింది. మిస్ వరల్డ్- 2025 పోటీలను తెలంగాణలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ గొప్ప ఈవెంట్‌ను రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను ప్రమోట్ చేయడం, విదేశీ పర్యాటకులను ఆకర్షించడం కోసం 120 దేశాల పోటీదారులను వివిధ ప్రాంతాల సందర్శనకు తీసుకువెళుతున్నారు. ఇందులో భాగంగా ఆసియా- ఓసియానాకు సంబంధించి 22 దేశాలకు చెందిన ముద్దుగుమ్మలు పాలమూరులో శుక్రవారం సందడి చేశారు. తెలంగాణ హెరిటేజ్, కల్చర్‌ను వారికి తెలిపేలా అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. కట్టుదిట్టమైన మూడంచెల భద్రత మధ్య పిల్లలమర్రికి వచ్చిన ముద్దుగుమ్మలకు కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి స్వాగతం పలుకగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జి. మధుసూదన్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, కశిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, సీఎం సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి ఆద్యాంతం వారి వెంట ఉండి పాలమూరు విశిష్టతను వారికి వివరించారు. పురావస్తు నిపుణుడు ఈమని శివనాగిరెడ్డి మ్యూజియంలో ఉన్న వివిధ పురాతన వస్తువులు, దేవతామూర్తుల చరిత్ర, ఆనవాళ్లను వారికి వివరించారు. ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మల వద్ద ముద్దుగుమ్మలు బతుకమ్మ ఆడారు. సెల్ఫీలు తీసుకున్నారు. వీడియోలు రికార్డు చేసుకున్నారు. బంజార నృత్యం చేస్తుండగా స్టెప్పులు వేశారు. పర్యావరణాన్ని కాపాడటంలో భాగంగా 11 మొక్కలను పిల్లలమర్రి చెంతన నాటారు. ఈ చరిత్రను, పాలమూరు ప్రత్యేకతను విశ్వవ్యాప్తం చేస్తామని ప్రకటించారు. సాయంత్రం 4.53 గంటలకు పిల్లలమర్రికి

(మిగతా 7లో..)



ఇండియా పోటీదారు

టర్కీ అందగత్తె

లెబనాన్ సుందరీమణి



ఫొటోలు తీసుకుంటున్న సుందరీమణులు



సుందరీమణులకు స్వాగతం పలుకుతున్న కళాకారులు



పిల్లలమర్రి మ్యూజియాన్ని తిలకిస్తూ..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం



తిరిగి వెళ్తూ.. బైబై చెబుతున్న అందగత్తెలు



సుందరీమణులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



పిల్లలమర్రి మ్యూజియం గురించి వివరిస్తున్న అధికారి



హస్తకళా ప్రదర్శనను తిలకిస్తూ..



పిల్లలమర్రి వద్ద నృత్యం చేస్తున్న కళాకారిణులు

అడవి బిడ్డలకు అండ

- ఇందిర సౌర గిరి జల వికాస పథకంతో చెంచులకు మహర్దశ
- రూ. 12,600 కోట్లతో చేయూత
- 19న మాచారంలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం సభ కోసం సిద్ధమౌతున్న వేదిక

ముఖ్యమంత్రి పర్యటన వాయిదా

నాగర్‌కర్నూల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నల్లమల పర్యటన ఒక రోజు వాయిదా పడింది. హైదరాబాద్‌లో అత్యవసర పనుల కారణంగా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిర సౌర గిరి జల వికాస పథకాన్ని ఆయన ప్రారంభించేలా షెడ్యూల్ ఇదివరకే ఖరారైంది. అత్యవసర పనుల వల్ల సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారానికి బదులు సోమవారం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.



పండ్ల తోటలకు డ్రిప్ పైపులను బిగిస్తున్న హార్టికల్చర్ అధికారి

నాగర్‌కర్నూల్/అచ్చంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని చెంచులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించనుంది. ఈ నెల 19న నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో ఇందిర సౌర, గిరి జల వికాస పథకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంకురార్పణ చేయనున్నారు. చెంచుల స్థితిగతుల్లో పూర్తిస్థాయిలో మార్పు తేవడానికి ఉద్దేశించిన ఈ పథకం ద్వారా అడవి బిడ్డల కష్టాలు గట్టెక్కనున్నాయి. క్షేత్ర స్థాయిలో కొన్ని సమస్యలను పరిష్కరిస్తే చెంచులకు శాశ్వత జీవనోపాధి దొరకనుంది.

ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు

మాచారం గ్రామంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించనున్న ఇందిర సౌర గిరి జల వికాస పథకం ప్రారంభ కార్యక్రమానికి అధికారులు పనుల వేగవంతం చేశారు. రైతు పొలాలలో బోరు వేయడం సోలార్ మోటార్లను బిగించడం డిప్ పైప్‌లైన్ల ఏర్పాటుతో పాటు ముఖ్యమంత్రి దిగేందుకు హెలిపాడ్‌తో పాటు సభాస్థలిని సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు హాజరుకానున్నట్లు తెలుస్తుంది.

అండగా నిలువనున్న కొత్త పథకం

నల్లమలలో అటవీ ఉత్పత్తులు క్రమంగా తగ్గిపోతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఇందిర సౌర, జల, గిరి వికాసం పథకం తోడ్పాటునందించనుంది. దీనికారణంగా నల్లమలలో నివసిస్తున్న దాదాపు 10 వేల మంది చెంచులకు మేలు చేకూరనుంది. అటవీ అధికారుల కఠినమైన నిర్ణయాలతో నల్లమలలో చెంచులు పోడు వ్యవసాయం కూడా చేసుకోలేని పరిస్థితి ఉత్పన్నమైంది. గతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఘర్షణలో అధికంగా నష్టపోయింది అడవి బిడ్డలే. పోడు వ్యవసాయం కూడా వర్షాధారిత పంటలు పండించుకోవాల్సిన కఠినమైన నిబంధనలు అమలయ్యేవి. అడవీ ప్రాంతంలో విద్యుత్ తీగలను లాగడానికి అటవీ శాఖ కఠినమైన అభ్యంతరాలను వ్యక్తంచేసింది. దీంతో చెంచులు తమలో పంటలు పండించే చేవ ఉన్నా నీటి సౌకర్యం

(మిగతా 6లో..)

ధరణి సొమ్ము దరి చేరేనా?

- అయోమయంలో దరఖాస్తుదారులు
- ప్రభుత్వాలు మారినా తిరిగిరాని సొమ్ము
- 11 వేల దరఖాస్తుదారులు
- దాదాపు రూ. 3 కోట్లు

6

నేటి నుంచి పాలమూరు యూనివర్సిటీకి సెలవులు

పాలమూరు యూనివర్సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి) : పాల మూరు యూనివర్సిటీ, అనుబంధ పీజీ కళాశాలలకు శనివారం నుంచి జూన్ 15 వరకు సెలవులను ప్రకటిస్తున్నట్లు పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులకు నెల రోజుల పాటు సెలవులు వర్తిస్తాయని, తిరిగి జూన్ 16న తరగతులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పరి పాలనకు సంబంధించిన వ్యవహారాలు కొనసాగుతాయని తెలిపా రు. పీయూ అనుబంధంగా ఉన్న అన్ని డిగ్రీ కళాశాలల విద్యా ర్థులకు సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

50 తులాల వెండి వస్తువుల వితరణ



వెండి వస్తువులను అందజేస్తున్న రావుల చంద్రశేఖర్‌రెడ్డి

పెబ్బేరు, మే 16 (ఆంధ్రజ్యోతి); వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసి పాలిటీలోని అయ్యప్పస్వామి ఆలయంలో కొత్తగా ప్రతిష్ఠించిన లలీ తా త్రిపురదేవిని శుక్రవారం మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. దివంగత రావుల పద్మమ్మ జ్ఞాపకార్థంగా శఠగోపం, స్థాలీ, ఉద్ధరిని, గంట, అరవేని 50 తులాల వెండి వస్తువులను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్వాహకులను శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు వనం రాములు, వడ్డె ఈశ్వర్, విశ్వరూపం, రమేష్, శాంతన్న, కిశోర్, పూజారి గోవర్ధనాచారి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.సుంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాల 5, 6, 7, 8 తరగతుల్లో, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ముస్లిం, క్రిస్టియన్‌లు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన జిల్లాలోని విద్యార్థులు తెలంగాణ మైనార్టీ రెసిడెన్సియల్ విద్యా సంస్థ వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రాణం తీసిన క్రికెట్ సరదా?

» నలుగురిపై కేసు నమోదు



అంజి (ఫైల్)

అమరచింత, మే 16 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ ఆటలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలం ధర్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం గ్రామ శివారులో జరిగిన క్రికెట్ పోటీలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఇరువురు కొట్టుకోవడంతో గ్రామానికి చెందిన బోయ అంజి (30) తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. కాగా మృతుడి భార్య మహేశ్వరి క్రికెట్ ఆడుతుంటే తన భర్త అంజి అక్కడికి వెళ్లడంతో ఘర్షణ పడి కొట్టినందుకే మృతి చెందాడని బాధ్యులైన నాగల్‌కడుమూర్, ధర్మాపూర్ గ్రామాలకు చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని అమరచింత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇప్పటికే నలుగురిపై కేసు నమోదు చేశామని, మరికొందరిపై విచారణ అనంతరం కేసులు నమోదు చేస్తామని సీఐ శివకుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాన్ని గ్రామానికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నాగన్నగౌడ్ (ఫైల్)

భూత్పూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కొత్తమొల్గర గ్రామానికి చెందిన పోల్కం నాగన్నగౌడ్(55) గురువారం సాయంత్రం గ్రామంలోని కమాలోద్దీన్ దర్గా వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా పాతమొల్గర గ్రామానికి చెందిన గంగాధర్‌గౌడ్ తన బైక్‌పై వెళ్తూ నాగన్నగౌడ్‌ను ఢీకొన్నాడు. ఆయన తలకు తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అడ్డాకులలో వృద్ధుడు..

మూసాపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): అడ్డాకుల మండల కేంద్రంలోని జాతీయ రహదారి పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి రోడ్డు దాటుతున్న మునలయ్య(60)ను డీసీఎం వేగంగా ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గాయపడిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తిగా భావించగా పోలీసుల విచారణలో కౌకుంట్ల మండలం పేరూరు గ్రామస్థుడని తేలింది. ఘటనపై విచారణ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు అడ్డాకుల ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

ధరణి సొమ్ము దరిచేరేనా?

» అయోమయంలో దరఖాస్తుదారులు
» ప్రభుత్వాలు మారినా తిరిగిరాని సొమ్ము
» 11వేల మంది దరఖాస్తుదారులు
» రావాల్సింది దాదాపు రూ. 3 కోట్లు

అయిజ, మే 16 (ఆంధ్రజ్యోతి): ధరణి సొమ్ము నేటికీ దరఖాస్తుదారుల దరికి చేరలేదు. వస్తాయో రావో అనే అయోమయంలో దరఖాస్తుదారులు ఉన్నారు. ప్రభుత్వాలు మారినా నేటికీ ఫలితం కనిపించలేదు.

భూ సమస్యల పరిష్కారం కోసం..

భూ సమస్యల పరిష్కారం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి స్లాట్‌ను 29 అక్టోబరు 2020న అమలులోకి తీసుకువచ్చింది. వ్యవసాయ, వ్యవసాయేతర ప్రజల ఆస్తులు నమోదు ఉండి అధికారిక వెబ్‌సైట్, భూమి రిజిస్ట్రేషన్‌లు, మ్యూటేషన్‌లు, ఆస్తుల బదిలీలకు, వారసత్వ విభజనను సరళీకృతం చేయటం, ప్రజలకు ఈ పట్టాదారు పాస్ పుస్తకం అందించటమే ఉద్దేశం. భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ధరణిలో స్లాట్ బుక్ చేసుకునేందుకై మీ సేవా కేంద్రాల్లో అవకాశం కల్పించింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంది. దీని ఆధారంగా సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలో వేలాది మంది రైతులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిర్దేశించిన ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారు. స్లాట్‌లో నిర్దేశించిన తేదీలో రాకున్నా, వారే రద్దు చేసుకున్నా, వివిధ కారణాలతో ఆ రోజు అందుబాటులో లేకున్నా, అధికారులు రద్దు చేసినా చెల్లించిన సొమ్ము తిరిగి వారి బ్యాంకు ఖాతాలోకి జమ కావాల్సి ఉంది.

జిల్లాలో 11వేల మంది..

డబ్బులు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్న దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా మొత్తంగా దాదాపు 11వేల మంది వివిధ అంశాలు తెలియపరుస్తూ ధరణిలో స్లాట్ బుక్ చేసుకోగా, అందులో అధికారుల చేత రద్దు అయిన వాళ్లు, సొంతంగా రద్దు చేసుకున్న వారు ఉన్నట్లు తెలుస్తోంది. వారికి సంబంధించి మొత్తం దాదాపు రూ. 3 కోట్ల వరకు ఉండొచ్చని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. స్లాట్ బుక్ చేసుకుని రద్దయిన డబ్బులు నేరుగా దరఖాస్తుదారుల ఖాతాలోనే జమ అవుతాయని అంటున్నారు. చెల్లించిన డబ్బులు ప్రభుత్వ ఖజానాకు జమ అవుతున్నట్లు తెలుపుతున్నారు. తిరిగి అక్కడ నుంచే నేరుగా దరఖాస్తుదారులకు చేరుతాయంటున్నారు. తిరిగి డబ్బులు చెల్లింపు విషయం రెవెన్యూ శాఖకు సంబంధం లేదని పేర్కొంటున్నారు. ఈ విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందంటున్నారు.

చట్టాలు మారడంతో..

ధరణి స్థానంలో నూతన రెవెన్యూ చట్టం రావటంతో స్లాట్ బుకింగ్ డబ్బులు తిరిగి వస్తావో రావోనని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన ఆర్వోఆర్ ధరణి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని మార్పులు చేస్తూ అందరికి ఉపయోగపడేలా భూ భారతి చట్టాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అమలు పరుస్తోంది. ధరణి దరఖాస్తుదారుల సొమ్ము తిరిగి చెల్లించాలని కోరుతున్నారు.

దరఖాస్తు సొమ్ము తిరిగి ఇవ్వాలి



ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసేవిగా ఉండాలి. ప్రభుత్వాలు మారినా ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోకూడదు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రజలు మాత్రం మారరు. వారి అవసరాలు, కష్టాలు, సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రభుత్వాలు చేసిన చట్టాల ప్రకారం ధరణి దరఖాస్తుదారుల సొమ్ము వీలైనంత త్వరగా వారి వారి బ్యాంకు ఖాతాలో జమచేసిన ప్రజల ప్రభుత్వం అనిపించుకోవాల్సి ఉంది.

- ఆంజనేయులు, అయిజ అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు

ప్రభుత్వ పరిశీలనలో ఉంది

ధరణి స్లాట్ బుకింగ్ సొమ్ము ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు మాకు అందలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తాం. ప్రజలకు, ప్రభుత్వానికి బాధ్యులం.

- లక్ష్మీనారాయణ, అదనపు(రెవెన్యూ) కలెక్టర్

అడవి బిడ్డలకు అండ



సీఎం వాహన కాన్వాయ్ కోసం వేస్తున్న కంకర రోడ్డు



సీఎం రేవంత్‌రెడ్డి రాకకోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్

(5వ పేజీ తరువాయి)

లేక అనేక అవస్థలు పడ్డారు.

పైలట్ ప్రాజెక్టుగా అమ్రాబాద్ మండలం మాచారం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19న ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభం కానుంది. దీనికి అనుగుణంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామాన్ని ఎంపిక చేశారు. కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తున్నారు. గ్రామ జనాభా మొత్తం 1,072 కాగా, నివాసాలు 385, వీటిలో చెంచు నివాసాలు 46, 55 కుటుంబాలు జీవిస్తున్నారు. మొత్తం 23 ఆదివాసి చెంచు రైతులకు 47.5 ఎకరాలలో వివిధ పండ్ల తోటల సాగుకు జిల్లా అధికార యంత్రాంగం పనులు ముమ్మరం చేసింది. టీజీ రెడ్‌కో సంస్థ ద్వారా సోలార్ పంపు సెట్లను అందిస్తుండగా ఇప్పటికే గ్రామంలో 19 బోర్లు తవ్వగా, 15 బోర్లలో సమృద్ధిగా నీరు రావడంతో అటవీ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, అన్ని శాఖల అధికార యంత్రాగం ఆయా పనులలో నిమగ్నమై ఉన్నారు.

లాభాలు చేకూరే పండ్ల తోటలు

ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న ఈ పథకంతో రైతులకు అధిక లాభాలు ఇచ్చే పండ్ల తోటలను వృద్ధి చేయనున్నారు. ఐదేళ్లలో 6లక్షల ఎకరాలలో పోడు భూములకు సాగు నీరందించి తుంపర, బిందు సేద్యం ద్వారా అవకాడో, డ్రాగన్‌ఫ్రూట్స్, అంజీర, దానిమ్మ తోటలకు కావాల్సిన మొక్కలను తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా అవకాడో తోట ఎకరాకు 111 నుంచి 160 మొక్కలను నాటుతున్నట్లు అధికారులు తెలిపారు. నాలుగేళ్ల తర్వాత పంట చేతికందుతుందని, ఎకరాకు 300 నుంచి 600 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఒక్కో పండు ధర రూ. 80 నుంచి రూ. 100 వరకు పలుకుతుంది. తోటల చుట్టూ సంకర జాతి కొబ్బరి మొక్కలను నాటి, వాటి అంచున వెదురు మొక్కలను నాటడంతో కోతులను నివారించవచ్చునని అధికారులు తెలిపారు. పంట దిగుబడి వచ్చేవరకు ఎప్పుడు రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు అందించనున్నారు.

కోతుల సమస్యను పరిష్కరిస్తే..

నల్లమల అటవీ ప్రాంతంలో కోతుల బెడద అధికంగా ఉంది. వర్షాకాలంలో కోతులు వివిధ రకాల పంటల మీద చేసిన దాడులతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఈ క్రమంలో అమ్రాబాద్ ప్రాంతంలో బంగారం పండించే పొలాలు ఉన్నా పడావు పెట్టారు. మన్ననూర్, మాచారం, వెంకటేశ్వర్లబాయి, తుర్కపల్లి, వటువర్లపల్లి, దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ, సార్లపూర్, కుడిచింతల బయలు, మల్కామామిడి, కొత్తపల్లి, అమ్రాబాద్, ఎల్మపల్లి, తెలుగుపల్లి, కల్మానోనిపల్లి, జంగంపల్లి, ఏమిరెడిపల్లి, ఈదుల బాయి, కుమ్మరోనిపల్లి, పదర, వంకేశ్వరంలో కోతుల గురించి కష్టాలు ఎదుర్కొని పైకి వచ్చిన రైతులు లేరు. ఈ క్రమంలో కోతుల బెడదను కూడా అరికట్టి చెంచుల అభివృద్ధి కృషి చేయాల్సి ఉంది.

ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు

మాచారం గ్రామంలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభ కార్యక్రమానికి అధికారులు పనులు వేగవంతం చేశారు. రైతు పొలాలలో బోరు వేయడం, సోలార్ మోటార్లను బిగించడం, డ్రిప్ పైపులైన్ల ఏర్పాటుతో పాటు ముఖ్యమంత్రి దిగేందుకు హెలిప్యాడ్, సభా స్థలిని సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు హాజరుకానున్నారు.

రూ. 12,600 కోట్లతో అడవి బిడ్డలకు అభ్యుదయం

గతంలో చెంచుల సంక్షేమానికి కేటాయించిన నిధులన్నీ పక్కదారి పట్టాయి. అప్పాపూర్, బౌరాపూర్, ఫర్హాబాద్, రాంపూర్ పెంట, సంగిడి గుండాలలో వారి కోసం నిర్మించిన గృహాలు కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడం తప్ప చెంచులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అడవి బిడ్డల దాహార్తి తీర్చడం కోసం ఇచ్చిన నిధులన్నీ దోపిడీకి గురయ్యాయి. అప్పాపూర్‌ను అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వచ్చిన సందర్భంగా రూ. 50లక్షల కేటాయించినా చెంచుల గ్రామ పంచాయతీల తీర్మానాలు లేకుండా దాదాపు రూ. 30 లక్షలను కొందరు ఐసీడీఎస్ అధికారులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రూ. 12,600 కోట్లతో అడవి బిడ్డలకు అనేక రకాలుగా చేయూతనిచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్

» అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లింగయ్య



మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లింగయ్య

కల్వకుర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉంటుందని, శిక్షణలో అందిస్తున్న విషయాలను ఆకళింపు చేసుకొని తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లింగయ్య అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం డీఈవో రమేష్‌కుమార్‌తో కలిసి అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లింగయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై సాధారణ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌలభ్యాలను అందించేందుకు నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచి, మెరుగైన సామర్థ్యాలను అందించి ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెంచాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదిలో వినియోగించడం, మౌలిక భాష, గణిత అభివృద్ధి, కృత్రిమ మేధా ఆధారంగా అభివృద్ధి పరచడం విషయాలతో కార్యక్రమం రూపొందించబడిందని పేర్కొన్నారు.

ఉద్యానవన పంటలకు ప్రాధాన్యం

» కలెక్టర్ బదావత్ సంతోష్



మాచారం గ్రామంలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, వివిధ శాఖల జిల్లా అధికారులు

అమ్రాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా సౌరజల గిరివికాస పథకంతో ఆదివాసి గిరిజనులకు ఉద్యానవన పంటలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మాచారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను పలు శాఖల జిల్లా అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలోని 2.10 లక్షల మంది గిరిజన రైతులు లబ్ధి కలుగనుందన్నారు. పొలాల్లో సౌర విద్యుత్ ద్వారా పంపు సెట్లు బిగించి, డ్రిప్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. స్వల్పకాల పంటలు సాగు చేయించి రైతులకు శాశ్వత ఆదాయ వనరులు సమకురేలా కార్యాచరణను సిద్ధం చేసినట్లు కలెక్టర్ వివరించారు. అదనపు కలెక్టర్ దేవసహాయం, మన్ననూర్ ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి, డీటీడీవో ఫిరంగి, డీపీవో మోహన్‌రావు. ఉద్యానవన అధికారులు జగన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వడవని వడ్లు

» కొనుగోలు కేంద్రాలు తెరిచి 45 రోజులు..
» వానకు తడిసి ఎండకు ఎండుతున్న ధాన్యం
» మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్ల తీరుపై రైతుల అసంతృప్తి
» ఇప్పటి వరకు కొన్నది 1.62 లక్షల మెట్రిక్ టన్నులు



అయ్యవారిపల్లిలో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

వనపర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): వానకాలం సాగు సమయం సమీపిస్తున్నా జిల్లాలో చాలా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు 50 శాతానికి పైగా అలాగే ఉన్నాయి. సకాలంలో కొనుగోలు ప్రక్రియ పూర్తికాక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు ఎండకు ఎండి ముట్టుకుంటేనే చిరిగిపోతున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో బోనస్ ఆశ కోసం చాలా మంది సన్న వడ్లు సాగు చేశారు. అయితే మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి యాసంగిలో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1,40,346 ఎకరాల్లో సాగు

జిల్లాలో గతంలో పోలిస్తే ఈసారి వరి సాగు భారీగా పెరిగింది. ఈ యాసంగిలో 1,40,346 ఎకరాలలో వరి సాగు చేశారు. 3,78,556 మెట్రిక్ టన్నుల దిగుబడి ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో రైస్ మిల్లర్లు, వ్యాపారులు, స్థానిక అవసరాలకు పోగా 3.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు భావించారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా గత నెల 5వ తేదీ నుంచి విడతల వారీగా 437 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటి వరకు ఐకేపీ ద్వారా 65,687, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 93,941, మెప్మా ఆధ్వర్యంలో 3,081 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వీటి ద్వారా మొత్తం 3.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరణే లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 50 శాతం 1.62లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు.

కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరం

సకాలంలో కొనుగోలు పూర్తి కాకపోవడంతో కౌలు రైతులు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు. అప్పులిచ్చిన వ్యాపారులకు సమాధానం చెప్పలేకపోతున్నామని కౌలు రైతులు కంటతడి పెడుతున్నారు. మునుపెన్నడు లేని విధంగా ఈసారి కొనుగోలు కేంద్రాలలో తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని మండిపడుతున్నారు.

మిల్లర్లు, కాంట్రాక్టర్ల తీరుపై అసహనం

కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కాంట వివయంలో వేగవంతంగా చేస్తున్నా. తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు మండిపడుతున్నారు. లారీల కొరతతో పాటు మిల్లర్లు ధాన్యం దించుకోవడంలో ఆలస్యం చేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. తమ అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని చోట్ల లారీ డ్రైవర్లు కమీషన్లు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు దృష్టి సారించడం లేదని వాపోతున్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకుని వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు తరలింపు విషయంలో చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వ్యర్థాల వేలం రూ. 15.50 లక్షలే!

» వనపర్తి మునిసిపల్ ఆదాయానికి భారీగా కోత
» గత ఏడాది రూ. 29.30 లక్షలు పలికిన బహిరంగ వేలం
» బురిడీ బాబా నుంచి రికవరీ చేయని గత ఏడాది సొమ్ము
» బల్దియాకే బురిడీ కథనంతో నిజాలను బయటపెట్టిన 'ఆంధ్రజ్యోతి'



చికెన్, చేపల వ్యర్థాల తరలింపు కోసం జరుగుతున్న బహిరంగ వేలం

వనపర్తి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): వనపర్తి మునిసిపాలిటీకి 2025-26 సంవత్సరానికి సంబంధించిన చికెన్, చేపల వ్యర్థాల తరలింపు వేలంలో ఈ ఏడాది భారీగా కోత పడింది. శుక్రవారం మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చికెన్, చేపల వ్యర్థాల తరలింపు కోసం 12 నెలలకు గాను బహిరంగ వేలం నిర్వహించారు. అందులో ఎర్రవల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎరుకలి వెంకటయ్య అనే టెండర్ దారుడు వ్యర్థాల తరలింపు కోసం రూ. 15.50 లక్షల అత్యధిక వేలం పాట పాడి టెండర్‌ను సొంతం చేసుకున్నాడు. టెండర్ ప్రక్రియలో పాల్గొనడానికి మొత్తం 8 మంది సభ్యులు నిబంధనల ప్రకారం మునిసిపల్ కమిషనర్ వనపర్తి పేరుతో లక్ష రూపాయల డీడీ కట్టి, ఐదు వేల టెండర్ ఫాం పొంది వేలంలో పాల్గొన్నారు. కానీ గత ఏడాది 2024-25 సంవత్సరానికి జరిగిన బహిరంగ వేలంలో కేవలం 8 నెలల కోసమని అత్యధికంగా రూ. 29.30 లక్షలకు బహిరంగ వేలం జరిగింది. అలాంటిది ఈ ఏడాది మాత్రం 12 నెలలకు కలిపి కేవలం రూ. 15.50 లక్షలకే బహిరంగ వేలం దక్కించుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అదికూడా సర్కారీ పాట రూ. 15 లక్షలకు అధికారులు నిర్ణయించగా 8 మంది టెండర్‌దారులు కలిపి కేవలం రూ. 50 వేలు మాత్రమే అదనంగా పాట పాడి ముగించడం కొస మెరుపు.

• రాజకీయ అండదండలేనా?

గత ఏడాది చికెన్, చేపల వ్యర్థాల బహిరంగ వేలంలో పాల్గొన్న టెండర్‌దారుడికి కొంత రాజకీయ అండదండలు ఉన్నాయి. గత ఏడాది టెండర్ పొందిన వ్యక్తికి ఒక మాజీ కౌన్సిలర్ భర్త పూర్తిగా తోడు ఉండటం వల్ల బహిరంగ వేలంలో పాల్గొని ఏకంగా రూ. 19.20 లక్షల సొమ్మును వనపర్తి బల్దియాకు ఎగొట్టాడు. ఈ తతంగాన్ని గత నెల 25న బల్దియాకే బురిడీ పేరుతో కథనాన్ని ప్రచురించి వాస్తవాలను 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది.

కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం



ప్రస్తుతం ఈ ఏడాది చికెన్, చేపల వ్యర్థాల తరలింపు కోసం జరిగిన టెంటర్ విషయాన్ని కలెక్టర్‌కు వివరిస్తాం. కలెక్టర్ ఆమోదిస్తేనే టెంటర్ అప్పగిస్తాం, లేదంటే తదుపరి చర్యలు చేపడతాం. గతంలో టెండర్ ప్రక్రియ ఎలా జరిగిందో నాకు తెలియదు. అప్పుడు నేను లేను. ఇప్పుడు మాత్రం నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేసి టెండర్ పొందిన వ్యక్తితో అగ్రిమెంట్ చేసుకుని, సగం సొమ్ము ముందుగా జమ చేసుకుని, మూడు ఖాళీ చెక్కులు కూడా తీసుకుంటున్నాం. గత ఏడాది సొమ్మును కూడా ఒక్క పైసా వదలకుండా రికవరీ చేయిస్తాం. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు విషయాన్ని కూడా కలెక్టర్ ముందు ఉంచుతాం.

- వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్

క్రైం కార్నర్

సంపులో పడి చిత్రకారుడి మృతి


భీమ్లానాయక్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఓ చిత్రకారుడు ప్రమాదవశాత్తు సంపులో పడి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్ద కొత్తపల్లి మండల పరిధిలోని జొన్నలబొగుడ గ్రామానికి చెందిన చిత్రకారుడు ఆర్.భీమ్లా నాయక్ (35) పెద్దకొత్తపల్లిలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. శుక్రవారం ఆయన పాన్‌గల్ మండలంలోని కేతేపల్లి గ్రామంలో ఓ ఇంటికి రంగులు వేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఆ ఇంటి సమీపంలో ఉన్న సంపులో పడి మృతి చెందాడు. చిత్రకారుడు, ఉన్నత విద్యావంతుడు అయిన భీమ్లానాయక్ మంచి గాయకుడు, మిమిక్రీ కళాకారుడని స్థానికులు తెలిపారు.

ప్రేమ పేరుతో బాలికపై వేధింపులు

» యువకుడిపై పోక్సో కేసు

ఖిల్లాఘణపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలానికి చెందిన బాలిక (17)ను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ నెల 15న ఆమెను ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి తల్లిదండ్రులకు తెలిపారు. వారు యువకుడిని తండ్రిని ఈ విషయంపై ప్రశ్నించగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. దీంతో దీంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆ యువకుడు బాలికను తీసుకొచ్చి ఇంటి వద్ద వదిలేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

గోపాల్‌పేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, గోపాల్ మండల కేంద్రంలో ఓ మహిళ అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని చంద్రన్నగడ్డ కాలనీకి చెందిన మంగదొడ్డి చంద్రమ్మ శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి పోయింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో భర్త మంగదొడ్డి కురుమయ్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనింగ్ ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

4,250 కిలోల నల్లబెల్లం పట్టివేత


పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, వాహనంతో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది

పెబ్బేరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలంలోని రంగాపురం వద్ద 4,250 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటికను ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. సీఐ కరుణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశం మేరకు శుక్రవారం జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. ఆ సమయంలో కర్నూల్ జిల్లా నుంచి పెబ్బేరుకు వెళ్తున్న ఆటోను తనిఖీ చేయగా 750 కిలోల నల్లబెల్లం, రెండు లీటర్ల ఐడీ మద్యం, 10 కిలోల ఆలం పట్టుబడింది. అలాగే చిత్తూర్ జిల్లా నుంచి మహరాష్ట్రకు వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా, 3,500 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటిక, 4 లీటర్ల ఐడీ లిక్కర్ పట్టుబడింది. నల్లబెల్లం విలువ దాదాపు రూ.3 లక్షలకుపైగా ఉంటుందని సీఐ తెలిపారు. దేవరశెట్టి కిరణ్ అలియాస్ కోమటి కిరణ్‌కు రంగాపురం గ్రామానికి చెందిన వ్యాపారికి విక్రయించేందుకు తెస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. కర్నూలు జిల్లా, మామిదాలపాడుకు చెందిన మోహన్‌కుమార్, అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లికి చెందిన సుబ్రహ్మణ్యంలను అరెస్ట్ చేసి, కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నల్లబెల్లం, పటిక, ఐడీ లిక్కర్‌తో పాటు ఆటో, బొలెరోలను స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్సై పృథ్వీరాజ్, కానిస్టేబుళ్లు నాగరాణి, తిరుమలేశ్, జనార్దన్, వినోద్ పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో నీలిచిత్రాలు

» హన్వాడ మండల కేంద్రంలో ఉద్రిక్తత

హన్వాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాల్లో నీలి చిత్రాలు వైరల్ కావడంతో మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండల కేంద్రంలో శుక్రవారం ఉద్రిక్తత నెలకొన్నది. హన్వాడకు చెందిన ఫిజా ఫొటో స్టూడియో యజమాని ఎజాస్ పక్క మండలానికి చెందిన ఓ యువతిని లోబర్చుకున్నాడు. ఆమెతో సన్నిహితంగా ఉంటూ వీడియోలు తీశాడు. రెండు రోజుల క్రితం వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. అవి వైరల్ కావడంతో గ్రామానికి చెందిన యువకులు, యువతికి సంబంధించిన వారు గురువారం అతడిని పట్టుకొని దాడికి యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ యువకుడిని పట్టుకొని స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్టూడియోలో ఉన్న కంప్యూటర్, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా, మండల నాయకులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. పూర్తి స్థాయిలో విచారించి, కఠిన చర్యలు తీసుకుంటామని వారికి నచ్చచెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

ముద్దుగుమ్మా.. అదిరెనులెమ్మా..


పిలిప్పిన్స్, జపాన్ దేశాల సుందరీమణులు


మంగోలియా, సింగపూర్ దేశాల సుందరీమణులు

(5వ పేజీ తరువాయి)

చేరుకున్న అందాల భామలు షెడ్యూల్ ప్రకారం 7 గంటలకు తిరిగి వెళ్లాలి. కానీ, సాంస్కృతి నృత్యాలు, పేరిణి కళాప్రదర్శనలు, జాతీయత పెంపొందించే వందేమాతరం, జననీ జన్మభూమిశ్చా పాటలకు జెండాలు ఊపుతూ ఈ సాంస్కృతిక, చారిత్రక సమ్మేళనంలో మంత్రముగ్ధులై 8 గంటల వరకు ఇక్కడే ఉన్నారు. హస్తకళా ప్రదర్శనలు, చేనేత స్టాళ్లను వీక్షించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. మదినిండా పాలమూరు జ్ఞాపకాలతో అధికారులు అందజేసిన పిల్లలమర్రి జ్ఞాపికలతో వెనుదిరిగి వెళ్లారు. ఈ కార్యక్రమం ఆద్యాంతం కనులపండువగా సాగింది. తెలంగాణ పర్యాటక బ్రాండ్ అంబాసిడర్లుగా చారిత్రక ప్రదేశాలను ప్రచారం చేయాలని మిస్ వరల్డ్ పోటీదారులను మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. పాలమూరు జ్ఞాపకాలను, పిల్లలమర్రి చరిత్రను స్వదేశానికి వెళ్లాక మరిచిపోకుండా అందరికీ తెలియజేయాలని, తెలంగాణకు వేల ఏళ్ల చరిత్ర ఉన్నదని, ఉక్కు సంకల్పంతో స్వరాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ పర్యాటకం విశ్వవ్యాప్తం కావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

మ్యూజియం సందర్శన...

16వ శతాబ్దం కాలం నాటి రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన అనంతరం అందాల భామలకు ఈమని శివనాగిరెడ్డి మ్యూజియంలోని వస్తువులపై వివరించారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన వస్తువులను వారికి చూపించారు. మహాగణపతి విగ్రహం నుంచి అల్వాలపల్లి, గొల్లగుడి, పూడూరు, నందివడ్డెమాన్, పాన్‌గల్, కల్వకోల్ ప్రాంతాల హిందు, బౌద్ధ, జైన మతాలకు చెందిన శిల్పాలను, వస్తువులను వారికి చూపించారు. అమ్రాబాద్‌లో తవ్వకాల్లో లభించిన పాత రాతి యుగం పనిముట్లు, నవీన శిలాయుగపు పాత్రలు, విజయనగర, కుతుబ్‌షాహీల కాలం నాటి ఆయుధాలు, విగ్రహాల ప్రాశస్త్యాన్ని వివరించారు. శాతావహనుల నుంచి అసఫ్ జాహీల వరకు ముద్రించిన వెండి, సీసపు, బంగారు నాణేల గురించి తెలియజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...

పిల్లలమర్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. కూచిపూడి, భరతనాట్యం, ఒడియా, కతక్, కేరళ, పేరణి నృత్యంపై ఈ సందర్భంగా దాదాపు 20 నిమిషాలు ప్రదర్శనలు ఇచ్చారు. పోటీదారులకు త్రివర్ణ పతకాలు అందజేయగా వారు వాటిని ఊపుతూ అందరిలో జాతీయవాదం పెంపొందించారు. మేరా ఇండియా.. ప్యారా ఇండియా పాట అందరినీ ఆకట్టుకున్నది. నమస్కారం తెలంగాణ, హ్యాష్ టాగ్ పిల్లలమర్రి వద్ద ఫొటోలకు ఫోజులిచ్చి తెలంగాణ జరూర్ అనా అంటూ నినాదాలు చేశారు.

పాలమూరుకు వచ్చినది వీరే..

మిస్ వరల్డ్ పోటీలకు 120 దేశాల నుంచి ముద్దుగుమ్మలు రాష్ట్రానికి రాగా పిల్లలమర్రి సందర్శనకు అసియా- ఓసియానాకు చెందిన 22 దేశాల అందాల భామలు హాజరయ్యారు. ఇండియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్మేనియా, బంగ్లాదేశ్, కంబోడియా, జపాన్, ఇండోనేషియా, చైనా, కజకిస్తాన్, కిర్గిస్తాన్, మలేషియా, మయన్మార్, నేపాల్, ఫిలిప్పీన్స్, సింగపూర్, శ్రీలంక, తాయిలాండ్, టర్కీ, లెబనాన్, మంగోలియా, వియత్నాం సుందరీమణులు పాలమూరు అందాలను సందర్శించారు.

అడుగడుగునా నిఘా

» సుందరీమణుల రాకతో పాలమూరులో భద్రత కట్టుదిట్టం

» దారి పొడవునా అప్రమత్తం » మధ్యాహ్నం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు


బస్సు ఎక్కి టాటా చెప్తున్న సుందరి

మహబూబ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ 2025 పోటీదారుల పాలమూరు పర్యటన నేపథ్యంలో పోలీసులు శుక్రవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పర్యటన ఆసాంతం పూర్తి అప్రమత్తతతో వ్యవహరించారు. బందోబస్తు పరంగా తీసుకోవాల్సిన చర్యలను ఎస్పీ జానకి వారం రోజుల నుంచి దగ్గరుండి పర్యవేక్షించారు. పాలమూరులోని పిల్లలమర్రిని సందర్శించేందుకు హైదరాబాద్ నుంచి 22 మంది సుందరీమణులు 3 ప్రత్యేక బస్సులలో సాయంత్రం పాలమూరుకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచే ఉమ్మడి జిల్లాకు చెందిన పోలీసులంతా బందోబస్తులో పాల్గొన్నారు. జిల్లా సరిహద్దు అయిన బాలానగర్ శివారు నుంచి దారి పొడవునా అడుగడుగునా భ ద్రతను కట్టుదిట్టం చేశారు. బందోబస్తు నిర్వహించడంతోపాటు ఎవరూ నిరసన తెలుపకుండా ఉండేందుకు దారి పొడవునా నిఘా ఏర్పాటు చేశారు. ఇక పిల్లలమర్రిలో అందమైన భామల చుట్టూ మహిళా పోలీసులను బందోబస్తుగా ఏర్పాటుచేశారు. దాదాపు 200 మంది మహిళా పోలీసులకు ముందుగానే బ్లూ కలర్ సఫారీ సూట్ ఇచ్చి, బందోబస్తులో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. నిర్ణయించిన షెడ్యూల్ 5 గంటలకన్నా ముందుగానే సుందరీమణులు పిల్లలమర్రికి చేరుకున్నారు. 7:30 గంటల తరువాత తిరుగుప్రయాణం అయ్యారు. మళ్లీ వారు ప్రయాణిస్తున్న బస్సులు బాలానగర్ శివారు దాటే వరకు పోలీసులు దారి పొడవునా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. దాదాపు 1,300 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

మిస్ వరల్డ్ పోటీదారుల రాక సందర్భంగా పాల మూరులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే మెట్టుగడ్డ నుంచి పిల్లలమర్రి వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. ఈ రోడ్డు వెంట ఉండే హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాలను మూయించారు. రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి.


పురావస్తు మ్యూజియం ముందు మిస్‌వరల్డ్ పోటీదారులు

మహిళపై హత్యాచారం

» అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు » బైక్, సెల్‌ఫోన్, బంగారు, వెండి వస్తువులు స్వాధీనం

» వివరాలు వెల్లడించిన సీఐ కనకయ్య, ఎస్‌ఐ గోవర్ధన్



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ కనకయ్య, చిత్రంలో ఎస్‌ఐ గోవర్ధన్

నాగర్‌కర్నూల్ క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదంగా మృతి చెందిన కేసును పోలీసులు ఛేదించారు. ఆమెపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు నిర్ధారించినట్లు గుర్తించారు. కేసు వివరాలను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కనకయ్య గౌడ్, ఎస్‌ఐ గోవర్ధన్ వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బిజినపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ (40) భర్త నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తోంది. అదే మండలంలోని లింగసానిపల్లి గ్రామానికి చెందిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్ బోనాసి పరశురామ్ తన స్నేహితుడి ద్వారా ఆమె ఫోన్ నెంబర్ సేకరించుకున్నాడు. ఈనెల 11న ఆమెకు ఫోన్ చేసి, నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామ శివారుకు పిలుపించుకున్నాడు. ఆమెపై అత్యాచారం చేసి, హత్య చేశాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు గుండ్లు, కమ్మలు, ముక్కు పుల్ల, వెండి పట్టీలు తీసుకుని పరారయ్యాడు. కుళ్లిపోయిన ఆమె మృతదేహాన్ని ఈనెల 13న చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని విచారించి, మహిళను గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె సెల్ ఫోన్ నెంబర్ ఆధారంగా నిందితుడు పరశురాములును గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి నుంచి మృతురాలికి చెందిన బంగారు, వెండి ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ గోవర్ధన్, సిబ్బంది వెంకటేశ్, భీముడు, బాలస్వామి, దేవేందర్‌లను సీఐ అభినందించారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

» మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ » జేపీఎల్ టోర్నీ ప్రారంభం


బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జాంద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన జాంద్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ (జేపీఎల్) టోర్నీని మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జిల్లాకు చెందిన చాలా మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ముడా మాజీ చైర్మన్ వెంకన్న, జాంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుగిడి అనూప్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పవన్‌కుమార్, మల్లేశ్, కోశాధికారి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు సాయికుమార్, విశ్వకాంత్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, అవినాష్, శ్రీశైలం, శివకుమార్, నాయకులు అంజన్న, శివరాజ్, శివశంకర్, చెన్నవీరయ్య, శ్రీనివాస్, నవకాంత్ పాల్గొన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి బాలబాలికల జట్ల ఎంపికకు ఈనెల 18న పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ తఖీయొద్దీన్, శంకర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నల్గొండ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు జనన ధృవపత్రం, ఒరిజనల్ ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో రిపోర్టు చేయాలని కోరారు.

తరగతి గదిలో కాలక్షేపానికి చెక్

» పాఠశాలల్లో సెల్‌ఫోన్ వినియోగంపై ఆంక్షలు

» వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు » ఉత్తర్వులు అందలేదు : డీఈవో



వనపర్తి రూరల్/ నారాయణపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేయడం ఇక మీదట కుదరదు. ఎందుకంటే పాఠశాలల్లో సెల్‌ఫోన్ వినియోగంపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు తరగతి గదుల్లో సెల్‌ఫోన్లో ఇతరులతో మాట్లాడుతూ, సోషల్ మీడియాలో మునిగి తేలుతూ విద్యాబోధనను నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం సడలుతోంది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో సెల్‌ఫోన్ వినియోగంపై ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇటీవల డీఈవోలతో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా నిర్వహించిన సమావేశంలో స్పష్టమైన అదేశాలు జారీ చేశారు. తరగతి గదిలో సెల్‌ఫోన్ వినియోగించ కుండా చర్యలు చేపట్టాలని సూచించారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచి అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ఇటీవల జరిగిన విద్యాశాఖ అధికారుల సమావేశంలో తరగతి గదిలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడకూడదని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఈవీ నరసింహారెడ్డి ఆదేశించారు. పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు

బడిలో సెల్‌ఫోన్ వినియోగంపై ఉన్నతాధికారులు ఆంక్షలు విధించడం మీద ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు సానుకూలంగా స్పందిస్తుండగా, మరి కొందరు అభ్యంతరం తెలుపుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల నుంచి ఫోన్ వస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అలాగే స్కూల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల హాజరు నమోదుకు ఫేస్ రికగ్నైజే షన్ కోసం సెల్‌ఫోన్ వాడాల్సి ఉంటుందని చెప్తున్నారు. విద్యాశాఖకు సంబంధించిన సమాచారాన్ని ఫోన్ల ద్వారానే పంపిస్తున్నట్లు గుర్తు చేస్తున్నారు. ఈ పనుల కోసం ఫోన్లు కాకుండా ఇతర పరికరాలు అందిస్తే బాగుంటుందని చెప్తున్నారు.

- వనపర్తి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక 358, ప్రాథమికోన్నత 60, ఉన్నత 99, మోడల్ 3, కేజీబీవీలు 14, సోషల్ వెల్ఫేర్ 5, ట్రైబల్ వెల్ఫేర్ 2, మైనార్టీ వెల్ఫేర్ 3, మహాత్మా జ్యోతిబాపూలే 4, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల 1 ఉన్నాయి. మొ త్తం మూడు వేల మందికి పైగా ఉపాధ్యా యులు విధులు నిర్వహిస్తున్నారు. 47 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నారా యణపేట జిల్లాలో 508 ప్రభుత్వ పాఠశాలల ఉన్నాయి. అయా పాఠశాలల్లో 2100 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.



కోస్గిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పక్కాగా అమలు చేస్తాం



బడులకు సెల్‌ఫోన్ వద్దంటూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిఇన మాట వాస్తవమే. కానీ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇప్పటి వరకు జిల్లాకు రాలేదు. బడులు ప్రారంభమయ్యే నాటికి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయులు బడులకు సెల్‌ఫోన్ తీసుకపోకుండా చర్యలు చేపడతాం. ఒకవేళ ఎవరైనా మొబైల్ ఫోన్ వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- అబ్దుల్ ఘనీ, డీఈవో, వనపర్తి

ఇంటర్వ్యూ..

పండ్లతోటల సాగును సద్వినియోగం చేసుకోవాలి

- పాగుంట స్వామి, ఏపీవో, ఎన్‌ఆర్‌ఈజీఎస్



గట్టు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఏపీవో) పాగుంట స్వామి అన్నారు. ఉపాధి పథకం ద్వారా చేపడుతున్న పనుల వివరాలను ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వివరించారు.

పండ్ల తోటల సాగుకు రైతులను ఎలా ప్రోత్సహిస్తున్నారు?

ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులుపండ్లతోటల సాగు చేయాలని ప్రభుత్వం సూచిస్తున్నది. ఉపాధి హామీ పథకం ద్వారా వారికి సహకారం అందించనున్నది. మామిడి, బత్తాయి, సపోట, జామ సాగు చేయవచ్చు. అర ఎకరంలో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అనుమతి ఉంది. పండ్ల తోటల నిర్వహణ కోసం మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం అందించనున్నది.

మండలంలో ఉపాధి హామీ పనులు ఎలా సాగుతున్నాయి?

ఉపాధి చురుగ్గా సాగుతున్నాయి. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కూలికి పని కల్పిస్తున్నాం. మండలంలో 4,214 మందికి, 26,170 రోజుల పని దినాలు కల్పించాము.

కూలీలకు సౌకర్యాలు కల్పిస్తున్నారా?

పనిప్రాంతాల్లో కూలీలకు నీడ కోసం టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుతున్నాము.

ఈజీఎస్ పనుల్లో రాజకీయ జోక్యం ఉందా?

రాజకీయ జోక్యం లేదు. ఇప్పటికీ 10 జీపీలకు రెగ్యులర్ ఎఫ్ఏలు ఉన్నారు. 11 జీపీలకు సీనియర్ మేట్‌ల ద్వారా పనులు చేపడుతున్నాము. వారు నిర్ణయించిన పనుల మేరకే కూలీలకు పని కల్పిస్తున్నాము.

న్యూస్ బాక్స్

తహసీల్దార్ బదిలీ

మల్దకల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మల్దకల్ తహసీల్దార్ షాహీదాబేగం శుక్రవారం వికారాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. మూడు నెలలు క్రితమే ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈమె స్థానంలో కొత్తవారిని నియమించలేదని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఉద్యమ నేత వీరన్న ఆశయ సాధనకు కృషి

గద్వాల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విముక్తి కోసం దశాబ్దాల క్రితమే పోరాటం కొనసాగించిన ఉద్యమ నేత వీరన్న ఆశయ సాధనకు కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ అన్నారు. మారోజు వీరన్న 26వ వర్ధంతిని గురువారం పట్టణంలోని సీపీఐ-ఎంఎల్, న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య, సీపీఐ-ఎంఎల్ నాయకులు హరీశ్‌కుమార్, కోళ్ల అంజి, గోపాల్ ఉన్నారు.

పంట మార్పిడితోనే అధిక దిగుబడి

మానవపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది వ్యవసాయ పొలంలో పంటల మార్పిడితోనే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేతలు ఈశ్వర్‌రెడ్డి, నళిని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంలో వారు మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏవో సందీప్, ఏఈవోలు భవాని, మణిప్రకాశ్, రాజమోహన్, వెంకటేశ్, నాగరాజు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వడ్డేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): వడ్డేపల్లి మునిసిపాలిటీ కేంద్రం అయిన శాంతినగర్‌లోని రామచంద్రకాలనీలో శుక్రవారం వడ్డే శారదమ్మ, వడ్డే వెంకటేశ్వర్లు దంపతుల కుమార్తె జాహ్నవి(శిరీష) వివాహం జరిగింది. పెళ్లికి హాజరైన మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆర్‌ఎస్ కరుణ భర్త వడ్డేపల్లి సూరి పెళ్లి కానుకగా రూ.10,116లు అందజేసి వధూవరులను ఆశీర్వదించారు.

పశువులకు టీకాలు వేయించాలి

వడ్డేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): పశువులు సీజనల్ వ్యాధులబారిన పడకుండా ముందస్తుగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి స్వరూపరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని బుడమర్సు, గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో పశువులకు, ఆవులు, ఎద్దులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వరప్రసాద్, లతీఫ్, బుచ్చమ్మ, వెంకటమ్మ, పాలాగు, కృష్ణ ఉన్నారు.

సామూహిక చండీహోమాలు

అలంపూరు మే16 (ఆంధ్రజ్యోతి): అలంపూరు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో భక్తులు శుక్రవారం సామూహిక చండీహోమాలు చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం, చీర, గాజులు, త్రిశతి ఖడ్గమాలలు సమర్పించారు.

ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

» రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

» కలెక్టర్ బీఎం సంతోష్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలన్నారు. గ్రామ పంచాయతీల వారిగా లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తిచేసి, ఎంతమందికి అర్హులుగా గుర్తించారో, ఎంతమందిని నిరాకరించారో స్పష్టమైన జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత లేనివారి నిరాకరణకు గల కారణాలను కూడా జాబితాలో తెలుపాలన్నారు. అలాగే రాజీవ్ యువవికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో ఎంపిక జరగాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, డీపీవో నాగేంద్రం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్‌బాబు, ఎల్డీయం శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు ఉన్నారు.

● ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్‌హాలులో ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాలు కురిసే అవకాశమున్నందు వల్ల ధాన్యం తేమశాతం 17కు చేరగానే సంచుల్లో నింపి, లారీల్లో వెంటనే లోడ్‌చేసి మిల్లులకు తరలించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డీఎస్‌వో స్వామి కుమార్, పౌరసరఫరా శాఖ మేనేజర్ విమల, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్, అడిషనల్ డీఆర్‌డీవో నర్సింహులు, అధికారులు ఉన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం)లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ శుక్రవారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేశ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

● 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా సాఫీగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి వరిధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశామన్నారు. మరో 88వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు. వీసీలో అదనపు కలెక్టర్లు, అధికారులు ఉన్నారు.

భూభారతితో రైతులకు అన్నివిధాలా న్యాయం



షాబాద్ రెవెన్యూ సదస్సులో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

- ఆర్డీవో శ్రీనివాసరావు

ఇటిక్యాల, మే 16(ఆంధ్రజోతి): ప్రభుత్వం భూభారతి చట్టంతో రైతులకు అన్ని విధాలా న్యాయం చేసేందుకు కృషి చేస్తుందని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని షాబాద్ గ్రామంలో నిర్వహించిన భూభారతి సదస్సులో పాల్గొని మాట్లాడారు. భూభారతి(ఆర్ఓఆర్) చట్టాన్ని అమలుచేయడం ప్రారంభించిందన్నారు. భూ వివాదాల పరిష్కారానికి ఈ నెలాఖరులోగా అర్హులైన వారికి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. రైతులు నిర్దేశిత ప్రొఫార్మా ద్వారా దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఈ సదస్సులో భూరికార్డుల సవరణలు, విస్తరణ మార్పులు, వారసత్వ సమస్యలు, సాదా బైనామాలు, సర్వే నంబర్ల గల్లంతు, పాస్‌బుక్ జారీ కాకపోవడం వంటి అంశాలకు సంబంధించి అర్జీదారుల నుంచి దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వీరభద్రప్ప, నరేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌డీఎస్ చివరి ఆయకట్టుకు నీరందించాలి

» బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అయిజలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నెట్టెంపాడు, గట్టు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తి కాకుండా జూరాల - పాకాల ప్రాజెక్టుల ప్రస్తావన గురించి మాట్లాడటం చాలా విడ్డూరమని అన్నారు. గురువారం ఇంజనీరింగ్ ఉన్నతాధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి ఈ విషయం ప్రస్తావనకు తీసుకురావటంపై జిల్లా రై తులు మండిపడుతున్నట్లు తెలిపారు.

ఉమ్మడి రాష్ట్రంలో అత్యధికంగా అన్యాయానికి గురైంది ఆర్‌డీఎస్ రైతులే అన్నారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి అయినా ఇక్కడి రైతులకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గోపాలకృష్ణ, భగత్‌రెడ్డి, నాయకులు లక్ష్మన్‌గౌడు, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాణించాలి

● గద్వాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌చంద్ర

● ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-19, 23 క్రికెట్ సెలక్షన్స్‌కు ముఖ్యఅతిథిగా హాజరు



బ్యాటింగ్, బౌలింగ్‌ను పరిశీలిస్తున్న అధ్యక్షుడు శరత్ చంద్ర, కార్యదర్శి శ్రీనివాస్

గద్వాల అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాణించాలని గద్వాల క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శరత్ చంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఎండీసీఏ, హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-19, 23 క్రికెట్ సెలక్షన్స్‌కు ఆయనే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో ఉండే నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ప్రోత్సహించడంతో ఇలాంటి ఎంపిక పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే మంచి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రికెట్ క్రీడాకారులు మంచి ఆటతీరును కనబరిచి ఐపీఎల్ స్థాయికి ఎదిగే విధంగా రాణించాలన్నారు. అనంతరం కోచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ అండర్-19, 23 ఎంపిక పోటీలకు జిల్లా నుంచి 75 మంది క్రీడాకారులు హాజరుకాగా, వీరిలో అండర్-19 విభాగం నుంచి 18, అండర్-23 విభాగం నుంచి 18 మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు.

ఎంపిక పోటీలకు పరిశీలకులుగా ముక్తార్ అలీ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడారులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గద్వాల న్యూటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గట్టు మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గట్టు మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గద్వాల తిమ్మప్ప, నాగరాజు తదితరులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మె వాయిదా

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహ

గద్వాల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరగాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు కేంద్ర కార్మిక సంఘాలు ప్రకటించాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20న సమ్మె చేయకుండా కార్మికులు తాము పనిచేసే ప్రదేశాల్లో నిరసన కార్యక్రమాలుచేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ, దేవదాసు, నరసింహులు, ఆనంద్ ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అలంపూరు, మే16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని తుంగభద్రా నది నుంచి శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లా ఈ తాండ్రపాడు గ్రామానికి చెందిన అనిల్, మధ్యాహ్నం అలంపూరు మండలం సింగవరం గ్రామానికి చెందిన సునీల్ అనే వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అందాల పోటీలు రద్దు చేయాలి

» నిరసన వ్యక్తం చేసిన ప్రజా సంఘాల నాయకులు

» అక్రమ అరెస్టులు తగవు

గద్వాల సర్కిల్, మే 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించే ప్రపంచ అందాల పోటీలు రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందాల పోటీల్లో పాల్గొన్న యువతులు మహబూబ్‌నగర్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో జిల్లాలోని చైతన్య మహిళా సంఘం నేతలను కొందరిని గద్వాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి నిరసనగా గురువారం గద్వాలలోని కృష్ణవేణి చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యాచారాలు, యువతులపై దాడులు తదితర నేరాలు చోటు చేకుంటున్న తరుణంలో ఇవేవీ పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వృధా చేస్తూ అందాల పోటీలకు సన్నద్ధం కావడం విచారకరమని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌కు వస్తున్న పోటీదారులను అడ్డుకుంటారన్న ఉద్దేశంతో అక్రమంగా జిల్లా మహిళా సంఘం నాయకులను అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అందాల పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు రేవతి, నాయకులు రేవతి, వెంకటమ్మ, ప్రజా సంఘం నాయకులు గోపాల్, సుభాన్, నాగన్న, వాల్మీకి, హరిబాబు, మోహన్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

● గద్వాలలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

● జిల్లా వ్యాప్తంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ



గద్వాలలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

గద్వాల న్యూటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాను డెంగీ రహిత జిల్లాగా మార్చేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పాత డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి వైద్యాధికారులు, వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డెంగీ వ్యాధి మన ఇంటిలోపల తిరిగే ఈడీస్ ఈజిప్టి అనే దోమ కుట్టుడం వల్ల ఆర్బోవైరస్ మన శరీరంలో ప్రవేశించడంతో వస్తుందన్నారు. ఈ దోమ పగటిపూట ఎక్కువగా కుడుతుందని, మళ్లీ మళ్లీ కుట్టే స్వభావం ఉండటం వలన ఇంటిలోని ఒకరికంటే ఎక్కువ మందికి ఈ డెంగీ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. వీటి నివారణకై ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, అర్బన్‌హెల్త్ సెంటర్ హెల్త్ సిబ్బంది ఉన్నారు.

● గట్టులో..

గట్టు : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి టీకే రమేశ్ ప్రారంభించారు. అంతకుముందు ఆసుపత్రిలో డెంగీజ్వరంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటాద్రినాయుడు, సోమశేఖర్ ఉన్నారు.

● మానవపాడులో..

మానవపాడు: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం డాక్టర్ హేమ మానస ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో వైద్యసిబ్బంది చంద్రన్న, వర్షిన్, దేవమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

● ఇటిక్యాలలో...

ఇటిక్యాల: మండల పీహెచ్‌సీ డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు.

● రాజోలిలో...

రాజోలి: డెంగ్యూ వ్యాధిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల వైద్య అధికారి డా.మధుబాబు అన్నారు. రాజోలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. దోమలు కుట్టకుండా ప్రజలు దోమతెరలు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రంజిత్ కుమార్, రామకృష్ణ, రంజిత్, సునిత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి



జాంపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న

● జిల్లా కో ఆర్డినేటర్ జ్యోత్స్న

● ఉపాధి కూలీలకు అవగాహన

ధరూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలను బాగా చదవించి విద్యావంతులుగా తీర్చిదిద్ది వారి ఉజ్వలభవిష్యత్‌కు బంగారుబాటలు వేయాలని జిల్లా కో ఆర్డినేటర్ జ్యోత్స్న అన్నారు. అదే సమయంలో ఉపాధి కూలీలకు బాల హక్కులు, చట్టాలపై అవగాహన అవసరమని సూచించారు. శుక్రవారం ధరూర్ మండల పరిధిలోని జాంపల్లి గ్రామంలో మహిళా అభివృద్ధి, జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కూలీలకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. బాలలు ఆపదలో ఉన్నట్లయితే 1098కి సమాచారం ఇవ్వాలని, అలాగే 181, 1930, 100 మొదలైన హెల్ప్‌లైన్‌ల గురించి తెలిపారు.

కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ చిట్టెమ్మ, నాగరాజు, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ భీసన్న, ఉపాధి కూలీలు ఉన్నారు.

భారతజాతి మహనీయులను మరవొద్దు



అయిజలో పోస్టర్ విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అయిజ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): భారత దేశ మహనీయులను ఎవ్వరూ మరువకూడదని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం అయిజలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన పోస్టర్ విడుదల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. భారతజాతి ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు తెలిసేలా పాటుపడిన అంబేడ్కర్, జ్యోతిబా పూలే వంటి వ్యక్తుల జీవిత చరిత్రలు నేటితరం కూడా తెలుసుకోవాలని తెలిపారు. పట్టువదలని వారి ముందుచూపును యువత స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఈనెల 20న ధన్వాడలో అంబేడ్కర్, జోతిబా పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల, అఖిలపక్ష కమిటీ నాయకులు కరుణాకర్, ఆంజనేయులు, పల్లయ్య, మారెప్ప, లోకరాజు, మోజేశ్, ప్రతాప్, భీసన్న, అనిల్, రాజు, శాస్త్రి పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుతో అవకాశాలు

● ప్రత్యేక అధికారి రతన్‌కుమార్



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రతన్‌కుమార్

గద్వాల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్లూమ్(చేనేత) టెక్నాలజీ కోర్సుతో భవిష్యత్‌లో యువతీయువకులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రత్యేక అధికారి టీఎస్‌సీవో రతన్‌కుమార్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూం టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సు ప్రవేశాల కోసం చేనేత మరియు జౌళి శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జీహ్యేశ్వర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ప్రత్యేక అధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుకు 60శాతం సీట్లు రాష్ట్రంలో చదివే విద్యార్థులకు కేటాయించారన్నారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు మూడు సంవత్సరాల కోర్సు, ఇంటర్ పాసైన విద్యార్థులకు రెండు సంవత్సరాల కోర్సు ఉంటుందన్నారు. ప్రభుత్వ విద్యార్థులకు ప్రతి నెల రూ.2,500లు స్టైఫండ్ అందిస్తుందని, అలాగే కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌డీసీ పథకం కింద నెలకు రూ.5వేలు అదనపు స్టైఫండ్ ఇస్తుందని వివరించారు. దీంతోపాటు ప్రతీ సంవత్సరం రెండుజతల యూనిఫాం ఉచితంగా అందజేస్తారన్నారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 25వరకు దరఖాస్తులను అసిస్టెంట్ డైరెక్టర్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, గద్వాల వారిని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య, డీవో సుధారాణి, ఏడీవో ప్రియాంక, ఏడీవో ఉపేందర్, క్లస్టర్ సీడీఈ మహేశ్, చేనేత మాజీ ఆప్కో డైరెక్టర్ గట్టు వీరన్న, రాజోలి, అయిజ, గొర్లఖాన్ దొడ్డి, మల్లంపల్లి, గట్టు, ఎక్లాస్‌పురం గ్రామాల చేనేత సంఘం నాయకులు, కార్మికులు ఉన్నారు.